సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటును నిలిపివేయాలి



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని సెయింట్ ఆల్ఫోంజా కరుణ నిలయం భవనంపై సెల్ టవర్ ఏర్పాటును విరమించుకోవాలని స్థానికులు నిర్వాహకున్ని కోరారు. భవనంపై ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కరుణాలయంలో వృద్ధులతో పాటు చిన్నారులకు ఆశ్రమం ఇస్తున్నారు. ఈ సెల్ టవర్ కారణంగా రేడియేషన్ ఉత్పన్నమై అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టవర్ పనులను వెంటనే నిలిపివేయాలని సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్



గోదామ్‌ను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్

రాజేంద్రనగర్: మండల కార్యాలయ ఆవరణంలో ఉన్న రంగారెడ్డి జిల్లా ఈవీఎం గోదామ్‌ను సోమవారం కలెక్టర్ శశాంక్ వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గది సీల్‌ను ఓపెన్ చేసి ఈవీఎంలను పరిశీలించారు. ఈ హాల్ నుంచి జిల్లాలోని వివిధ మండలాలకు ఈవీఎంలను తరలిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా సోమవారం ఈవీఎం గోదామ్‌ను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఐడీఈ' 2వ దశ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఐసీటీఈ నోడల్ సెంటర్ హెడ్ శివానీశర్మ తదితరులు

రాజేంద్రనగర్: వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బూట్ క్యాంపు 2వ దశ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ క్యాంప్ ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతుంది. విద్యా మంత్రిత్వ శాఖ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యూకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ (ఎంఐసీ) సహకారంతో ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 10 పది ప్రదేశాల్లో ఒకే రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం వర్చువల్ విధానంలో ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి డైరెక్టర్ (సీఅండ్‌డీ) డాక్టర్ అభయ్ సింగ్, సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూ.జి.ప్రసన్న కుమార్, ఏఐసీటీఈ నోడల్ సెంటర్ హెడ్ శివానీ శర్మ, కో–ఆర్డినేటర్ అవిష్ కుమార్ తివారీ, ప్రొసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్సపోర్ట్ డెవలప్‌మెంట్ ఆథారిటీ అసిస్టెంట్‌మేనేజర్ రాజ్ కుమార్, వాధ్వాని ఫౌండేషన్ నుంచి నవేద్ అన్సారీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర, నోడల్ సెంటర్ హెడ్ డాక్టర్ రాజేందర్, సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ డాక్టర్ జె.కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బండ్లగూడ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక సీట్లు గెలిపించుకునేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల వలే కష్టపడి పని చేయాలని మాజీ చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ వీబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా ఇన్‌చార్జీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్‌లోని కోర్ కమిటీ సభ్యులు ఈ సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కేఎస్. రత్నంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రలల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బీజేపీ చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేయాలన్నారు. ఫిబ్రవరి 10 నుంచి బీజేపీ బస్సు యాత్ర చేవెళ్ల పార్లమెంటులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్రలో రాష్ట్ర నాయకులు, జాతీయ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డి, మాధవరెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ అరుణ్‌కుమార్, పార్లమెంట్ ఇన్‌చార్జీ విష్ణువర్థన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్లు, పార్లమెంట్ కో కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలను ఉన్నత చదువు చదివించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: నిరుపేద పిల్లల అభ్యున్నతి వారి భవిష్యత్తు కోసం ప్రధాని నరేంద్రమోదీ బేటీ బచోవో –బేటి పఢావో పథకాన్ని ప్రవేశపట్టారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటిబచావో–బేటి పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించటానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి లక్ష్మిబాయి, పద్మజా, పాఠశాల హెచ్‌ఎం రఘుపతి, మాణిక్యంరెడ్డి, అగన్‌వాడి టీచర్స్, పాండుయాదవ్, శేఖర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ డివిజన్‌లో పేదల బస్తీలు ఎక్కువగా ఉన్నాయని, తాను కేంద్ర మంత్రిగా నియమితులైన నాటి నుంచే గుడిమల్కాపూర్ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించానన్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం తనను ఎప్పుడు కోరుతుండే వారని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో తాను డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలతో పాటు ఇంకా ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వందలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్‌లు, చారిత్రక ప్రదేశాల్లో అత్యాధునిక సాంకేతిక పద్ధతులో ప్రజలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాచీన చరిత్ర తెలియజెప్పడానికి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ మరోవైపు ప్రాచీన ఆలయాలను కూడా అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా సెంట్రల్ అధ్యక్షుడు గౌతమ్‌రావు, హైదరాబాద్ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండుయాదవ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ, నాంపల్లి కన్వీనర్ పవన్ కుమార్, రాహుల్ చంద్రా, బుజేందర్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలి..

పార్టీ అభ్యర్థుల విజయం కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ అభ్యర్థుల విజయం పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రచారంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. దేవర శ్రీనివాస్, దేవర వంశీ, అశ్విన్, రాధాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం..

నాంపల్లి: బీజేపీ మహిళా మోర్చా నేతలు సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం పర్యటనలో భాగంగా ఆసిఫ్‌నగర్ హుడా కాలనీ వచ్చిన మంత్రికి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఠాకూర్ మనీషా సింగ్ నేతృత్వంలో సుజాత, కె.నర్సింహ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ: ప్రభుత్వ స్థలాలు అక్రమాలకు గురవుతున్నాయని వాటిని కాపాడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ బుర్ర సాగర్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బండ్లగూ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికేందర్‌గూడలో సర్వే నెంబర్ 9,14,15,16 ప్రభుత్వ భూమి ఉందన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నకిలీ దస్తావేజులు సృష్టించి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్ వేసి ఆ లేఅవుట్‌లో ప్లాట్లను అమ్మకానికి ఉంచారన్నారు. మున్సిపల్, హెచ్‌ఎండీఏ, విద్యుత్ శాఖ వంటి సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగిస్తున్నారన్నారు. మార్కెట్‌లో ఈ స్థలం విలువ 300 కోట్లని, 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కొల్లొతున్నామన్నారు. అధికారులతో ఈ అక్రమ లేఅవుట్‌పై విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. మైనార్టీల కోసం ముస్లిం గ్రేవ్‌యార్డ్, శ్మశానవాటిక, ప్రభుత్వ గృహాలు, ప్లే గ్రౌండ్ వంటి ప్రజా అవసరాల కోసం ఈ భూమిని కేటాయించాలన్నారు. పక్కనే ఉన్న భవానీ కాలనీ సర్వే నెంబర్లతో పత్రాలను సృష్టిస్తు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారన్నారు. ఈ సర్వే నెంబర్లలో నమోదైన పత్రాలను వెంటనే రద్దు చేయాలని గండిపేట్ తహసీల్దార్, రాజేంద్రనగర్ ఆర్డీవో, నార్సింగి సబ్ రిజిస్ట్రార్ కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ సర్వే నెంబర్లలో ప్లాట్లు కొని ఎంతో మంది మోసపోతున్నారన్నారు. తక్షణమే చర్యలు తీసుకోని సర్వే నిర్వహించి ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరామన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామి ఇచ్చారన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గణేష్‌నగర్ కాలనీ వాసులు

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బైరాగిగూడలోని గణేష్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు, మంచినీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల ముందు డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండడంతో కాలనీ మొత్తం దుర్గంధంతో ఇబ్బందికరంగా మారాయన్నారు. దీని కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. గోతులమయమైన రోడ్లపై ప్రయాణించేందుకు వాహనాదారులు, ప్రజలు అవస్తలు పడుతున్నారన్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్‌కు వినతిపత్రం ద్వారా విన్నవించామన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ప్రసన్నకుమార్‌రెడ్డి, గోవిందరావు, కె.నరేష్, శేఖర్, శశికుమార్, విజయ్, రాజు తదితరులున్నారు.

నూతన వంగడాల రూపకల్పన పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జీవ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని నూతన వంగాడాల రూపకల్పన పై శిక్షణ కార్యాక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ హైదరాబాద్‌లో 2వారాలు ఈ జీవ సాంకేతికత పరిజ్ఞానం ఉయోగించుకొని నూతన వంగడాల రూపకల్పనపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణను పీజేటీఎస్ఏయూ, టీ.ఎస్.కాస్ట్ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీజేటీఎస్ఏయూ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ రఘురామిరెడ్డి పాల్గొన్ని నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగించి చీడపిడలు తట్టుకునే కొత్త వంగడాలు రూపొందిచాలన్నారు. భవిష్యత్తులో బయోటెక్నాలజీకి చాలా డిమాండ్ ఉంటుందని కావున అనేక రకాల పరిశోదనలు చెయ్యాలన్నారు. ఫిబ్రవరి 10 వరకు ఈ శిక్షణ కొనసాగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ రీసెర్చ్ ప్రోగామ్ డైరెక్టర్ ఇక్రిశాట్ షాన్‌మేస్, ఐబిటి డైరెక్టర్ సి.వి సమీర్, ఎడిఆర్ రాసాపాలేం మల్లారెడ్డి, మనిష్ పాండే, సి. అనురాధ వివిధ వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు సీడీపీఓకు సమ్మె నోటీసును అందజేసిన సీఐటీ



ప్రాజెక్టు సీడీపీఓకు సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

అత్తాపూర్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు సీడీపీఓకు సోమవారం ఫిబ్రవరి 16న జరగబోయే సమ్మె నోటీసును ఇచ్చారు. సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్, సీఐటీయు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కొంగరి కృష్ణలు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక రైతు వ్యవసాయ కూలీల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ఫోరం ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో యూనియన్ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయు ఆధ్వర్యంలో అందరూ పాల్గొంటారని తెలియజేస్తూ ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలన్నారు. 45వ ఐఎల్‌సీసీ పార్ట్స్ ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా గుర్తించాలని... కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని.. అంగన్‌వాడీ టీచర్స్‌కు సుప్రీంకోర్టు ప్రకారం గ్రావిటీని చెల్లించాలన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నాగమణి, రంగారెడ్డి జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీలత, జ్యోతి, సుకన్య, శోభ, రుక్మిణి, శోభారాణి, మీనా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గూంచహిల్స్, ఓషియన్ పార్క్, లెజెండ్ విల్లాస్, గండిపేట– శంకర్‌పల్లి రోడ్డు, గ్రావిటీ జిప్, రాయచందని కోకాపేట వన్, ఈఐపీఎల్ అపిల, ఆదిత్య విల్లాస్ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. బాబుఖాన్ ఫీడర్ పరిధిలోని ఘర్ కార్పొరేషన్, బాబుఖాన్ విల్లాస్, మూవీటవర్, గోల్డ్ ఫిష్, మైహోం లేబర్ క్యాంప్, అక్షయపాత్ర రోడ్, 250 గజాలు, 60 గజాల లేఅవుట్‌లలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండని ఆయన పేర్కొన్నారు. మణికొండ: మణికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ, అంజలిగార్డన్స్‌లలో, డాలర్‌హిల్స్, తిరుమల హిల్స్, బయూత్ కాలనీ, పీజీ కాలేజీ, ఖిజ్రా ఎన్‌క్లేవ్‌లలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గోల్డన్ టెంపుల్, శ్రీరాంనగర్ కాలనీ, తిరుమల హిల్స్ రోడ్డు నెంబర్ 1నుంచి 4 వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు.

డీసీసీ సంయుక్త కార్యదర్శి నియామకం



నియామక పత్రాన్ని అందుకున్న మాల్యాద్రి నాయుడు

మణికొండ: కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా మణికొండ మున్సిపాలిటీకి చెందిన మాల్యాద్రి నాయుడును నియమించారు. ఈ మేరకు సోమవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. మాల్యాద్రి నాయుడు మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పార్టీ పటిష్టతకు చేసిన కృషి , గత అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన తీరును గుర్తించి తనకు జిల్లా స్థాయి పదవిని కేటాయించారన్నారు. తనను డీసీసీలో నియమించటం పట్ల ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆనంద్ గౌడ్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న సత్యనారాయణ, కిరణ్ చారి

రాజేంద్రనగర్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన జి.ఆనంద్ గౌడ్ శనివారం రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, కిరణ్ చారి తదితరులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ వద్ద ఆమె తల్లి సుక్కమ్మ (56) ఉంటుంది. కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతుంది. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బయటి నుంచి వచ్చిన శ్రీనివాస్ ఇంట్లోకి వెళ్లి చూడగా...అప్పటికే మృతి చెందింది. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా వర్కర్స్ సమ్మె నోటీసులు అందజేత



జిల్లా డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ ఆశా వర్కర్స్, సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాదు జి.కవి మాట్లాడుతూ... 2024 ఫిబ్రవరి 16న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ఉన్న ఆశా వర్కర్స్ అందరూ సమ్మెలో పాల్గొంటారని తెలియజేస్తూ ఆశా వర్కర్స్ అందరికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత ఆశా వర్కర్స్ అందరిని పర్మినెంట్ చేయాలని... పని ఒత్తిడి తగ్గించాలని...అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత, కోశాధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్ క్లాత్ మార్కెట్ నూతన కమిటీ ఏర్పాటు



నియోజకవర్గం ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ క్లాత్ మార్కెట్ అసోసియేషన్ నూతన కమిటీని వస్త్ర వ్యాపారులు కలిసి ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం కాటేదాన్ మార్కెట్‌లో వస్త్ర వ్యాపారులు సమావేశం నిర్వహించుకొని నూతన వస్త్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బాస శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడుగా పులిజాల వివేక్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌గుప్తా, కోషాధికారిగా విజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పౌల్ట్రీ ఉత్పత్తుల పై వర్క్‌షాప్



శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగరలోని పీవీ నర్సింహరావు పశువైద్య కళాశాలలోని పశు వైద్య విస్తరణ విభాగంలో సోమవారం నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ ఫండ్ ప్రాజెక్ట్‌లో భాగంగా పశువులు, పౌల్ట్రీ ఉత్పత్తిలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం పై సీనియర్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలతో 1 రోజు వర్కుషాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ ఫండ్ ప్రాజెక్ట్ ప్రాధాన పరిశోధకుడు డాక్టర్ సిహెచ్. సత్యనారాయణ, పశువైద్య విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఏకాంబరం పాల్గొన్ని పశువులు, పౌల్ట్రీ ఉత్పత్తిలో నైపుణ్యాల ఆవశ్యకతను వివరించారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే పీడీ యాక్ట్

రాజేంద్రనగర్: రేషన్ బియ్యం అక్రమ దందా చేసే వారిపై పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. సోమవారం ఆయన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుబడిన బియ్యంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... శంషాబాద్ పరిధిలోని మిల్లులను తనిఖీ చేస్తామని చెప్పారు. వడ్ల మిల్లింగ్ మాటున రేషన్ బియ్యంను దాచి ఆ తరువాత చేస్తున్న దందాను గుట్టు రట్టు చేస్తానన్నారు. ఎవరెవరూ ఏయే మిల్లులకు రేషన్ బియ్యం చేరవేస్తారో వారిని పట్టుకోవడం తథ్యమని చెప్పారు. రేషన్ బియ్యం దందాతో అనవసరంగా యువత భవిష్యత్తు ఆగమ్య గోచరంగా అవుతుందన్నారు.

పార్కును అభివృద్ధి చేయండి



అత్తాపూర్: జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన పార్కులకు ఆలన పాలన చూసేవారు లేక పార్కు స్థలాల్లో చెత్త చెదారం వేయడంతో పాటు కొంత మంది అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. నందిముస్లాయిగూడ చౌరస్తా నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లే మార్గంలో ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పార్కు స్థలంలో ప్రత్యేక బోరు వేయించి గ్రీనరీని డెవలప్ చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని... అందుకు అనుగుణంగా డివిజన్ కార్పొరేటర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక యువకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నకిలీ దస్తావేజులతో రిజిస్ట్రేషన్‌కు యత్నం

రాజేంద్రనగర్: తన స్థలాన్ని నకిలీ దస్తావేజులతో పాటు ఇతరులతో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ వ్యక్తి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను మృతి చెందినట్లు ధృవీకరణ పత్రాన్ని జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామానికి చెందిన సిహెచ్. శ్రీనివాస్ రావు 2005లో జన చైతన్య హౌసింగ్ సొసైటీ ద్వారా బుద్వేల్‌లోని వెంచర్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశాడు. 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. శ్రీనివాస్ రావు కుమారులు విదేశాల్లో ఉండటంతో కొన్ని నెలలుగా వారితో అక్కడే ఉంటున్నాడు. ఈ విషయాన్ని పసిగట్టిన కొందరు శ్రీనివాస్ రావు మృతి చెందాడంటూ నకిలీ ధృవీకరణ పత్రాన్ని సృష్టించారు. అలాగే ఒక 58 ఏళ్ల మహిళను శ్రీనివాస్ రావు భార్య అంటూ నకిలీ ఆధార్ కార్డులను సృష్టించి 400 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు దస్తావేజులు సిద్ధం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం పది రోజుల క్రితం రాజేంద్రనగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రార్ ఆ మహిళను వివరాలు అడగగా పొంతన లేని సమాధానం తెలిపింది. దీంతో రిజిస్ట్రేషన్‌ను ఆపివేసింది. భూ పత్రాల్లో ఉన్న శ్రీనివాస్ రావు చిరునామాకు లేఖ రాసింది. సోమవారం హాజరు కావాలంటూ తెలపడంతో ఆయన ఉదయం రిజిస్ట్రార్ ముందు హాజరయ్యారు. తాను కొనుగోలు చేసిన దస్తావేజులతో పాటు తన పూర్తీ వివరాలను అందజేశారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగా మైత్రి ప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని గౌతమ్‌మోడల్ స్కూల్, కల్కి హెచ్ఆర్ సొల్యూషన్స్ తదితర సంస్థల్లోని వంద ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, బీఈడీ విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలు 83284 28933లో సంప్రదించవచ్చు.